క్లుప్తంగా

నకిలీ విత్తనాలను అరికట్టాలి



కొత్తగూడ: నకిలీ విత్తనాలను అరికట్టాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఎరువుల షాపులు రైతులకు ఉపయోగం పడటంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు విజయ్, లచ్చయ్య, సుకెందర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై పొంచి ఉన్న ప్రమాదం



చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు ఆకేరువాగు బ్రిడ్జిపై ప్రమాదం పొంచి ఉందని పలువురు వాహనదారులు తెలుపుతున్నారు. ఇటీవల రైతులు జొన్న పంటను నూర్పిడి చేసి తాలును బ్రిడ్జిపై వదిలేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి బ్రిడ్జిపై వ్యర్థాలు పేరుకుపోయి తాలు తడిసి పాకురు పట్టి జారీ పడే స్థితికి చేరింది. ద్విచక్రవాహనదారులు జారీ పడే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జిపై చెత్తను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

'ప్రేరణ ఉత్సవ్'కు ఎంపిక



గూడూరు: మండలంలోని పొనుగోడు జెడ్పీ హెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న భూక్య సావిత్రి జాతీయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల అక్షరాస్యత విభాగం చేపట్టిన ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమానికి ఎంపికైనట్లు హెచ్ఎం బుర్ర రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు ప్రదానం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవపురం గ్రామానికి చెందిన హనుమత్, శనీశ్వర ఉపాసకులు, యాజ్ఞిక బ్రహ్మ ప్రతిష్టాచార్య గుండోజు నాగార్జునాచార్యులకు విశ్వవాస్తు జ్యోతిష్యరత్న అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాదు రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహనాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందజేసి సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



కురవి: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని, నిరుద్యోగులందరు రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్రంగా నిలుస్తున్న తనను గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకున్న అనంతరం పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టభద్రులు ఆర్.శ్రీనివాస్, సింధూవర్మ, కొణతం వెంకటేశ్, సంగెం రంజిత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

దంతాలపల్లి: ఈనెల 23, 24 తేదీల్లో మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న కోరారు. కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఊడుగుల రాములు, సెగ్గం యాకయ్య, లింగయ్య, యుగేందర్, లింగయ్య, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కష్టాలు
- త్వరగా కాంటాలు పెట్టాలని వేడుకోలు



మహబూబాబాద్ రూరల్: జంగిలిగొండ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు



మహబూబాబాద్ అర్బన్: గాంధీపురంలో తడిసిన ధాన్యం నేర్పుతున్న రైతు



తొర్రూరు రూరల్: అమ్మాపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



కురవి: వరదలో కొట్టుకుపోయిన ధాన్యం



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ఎగిరిపోయిన వాటర్‌ప్లాంట్ పైకప్పు

మహబూబాబాద్ రూరల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు అకాల వర్షం తీరని కష్టాలను తెచ్చిపెట్టింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించేందుకు తీసుకువెళ్లిన ధాన్యం తడిసి రైతులు ఆ ధాన్యాన్ని అరబెట్టుకునేందుకు పడిన కష్టం చెప్పలేనివిధంగా మారింది. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు దంచికొట్టిన వర్షంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అమనగల్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, డీపీఎం నళినినారాయణ, ఏపీఎం తిలక్ సందర్శించి సకాలంలో కొనుగోళ్లు జరిపి, వెంటనే కాంటాలు పెట్టి మిల్లులకు తరలించాలని సూచించారు.

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లాలోని గురువారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మానుకోట మున్సిపల్ పరిధిలోని గాంధీపురం నాల్గో వార్డులో కొనుగోలు కేంద్రం వద్ద గాంధీపురం, అనంతారం గ్రామల రైతుల ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. దీంతో ఆరుగాలం శ్రమించిన పంటలు సాగుచేస్తున్న రైతులకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. కొనుగోలు నిర్వాహకుల నిర్లక్ష్యంతో ధాన్యం కొనుగోలు జాప్యం చేయడంతోనే ధాన్యం తడిసి ముద్దయిందని బాధిత రైతులు వాపోతున్నారు.

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురియడంతో ప్రజలు, రైతులు ఆగమాగమయ్యారు. మండల కేంద్రంలోని నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. శుక్రవారం ఉదయం కేంద్రానికి వచ్చి రాసులను చూసి రైతులు బోరుమన్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ఎం.సురేష్‌కు చెందిన వాటర్ ప్లాంట్ పైకప్పు రేకులు గాలిదుమారానికి ఎగిరిపడ్డాయి. మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్య తండా గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి మోదుగులకుంట చెరువు మత్తడి పోసింది. అలాగే మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్య తండా జీపీ పరిధిలోని పిల్లిగుండ్ల తండాకు వెళ్లే రహదారిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైల్వే ట్రాక్ పైకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన అధికారులు రహదారిని తవ్వి వరదనీటిని మళ్లించారు.

తొర్రూరు రూరల్: వారం రోజులుగా ఈదురు, గాలులతోపాటు అకాల వర్షాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ ధాన్యాన్ని మిషన్ల ద్వారా తూర్పారపడుతూ ఆరబెడుతూ కాంటాలు పెడుతున్నారు. ఈక్రమంలోనే గురవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యమంతా తడిసి ముద్దయింది. దిక్కులేని స్థితిలో ఉన్న రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ నానా తంటాలు పడుతున్నారు. ధాన్యాన్ని త్వరగా కాంటాలు పెట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

శిలాఫలకాలకే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం



పాకాల ఏటి వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

గార్ల: పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం శిలాఫలకాలకే పరిమితమైందని సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాసరావు, న్యూడెమోక్రసీ నాయకుడు గౌని భద్రయ్య ఆరోపించారు. శుక్రవారం వేర్వేరుగా పార్టీల ఆధ్వర్యంలో పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శిలాఫలకం ఏర్పాటు చేసి బ్రిడ్జి నిర్మాణం కోసం అట్టహాసంగా శంకుస్థాపన చేశారన్నారు. పార్టీ అధికారం కోల్పోయాక బ్రిడ్జి నిర్మాణం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య అయినా పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, పల్లా కోటి, రాగం రమేష్, రమేష్, ఇర్రి రవి, గౌని మల్లేష్, భావ్‌సింగ్, రవి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన గురుకులముల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో దరఖాస్తులు చేసుకున్న గిరిజన విద్యార్థులు ఈనెల 23న, 25న ఏటూరు నాగారం స్పోర్ట్ స్కూల్‌లో ఉదయం 10గంటలకు ధ్రువపత్రాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా గిరిజన గురుకులాల ఆర్సీఓ రాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. పదో తరగతి మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల, నివాస, ఆధాయ పత్రాలతో, ఆధార్ కార్డు, 4పాస్ ఫొటోలు, రెండు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. ప్రతి గ్రూప్‌లో మిగిలిన సీట్లును ఎస్టీ విద్యార్థులతోపాటు, ఎస్సీ-1, బీసీ-1, ఓసీ-1, అనాథ-1, స్పోర్ట్స్-1, దివ్యాంగులకు-1 కేటగిరిలతో మిగిలిన ఖాళీలన్ని కౌన్సెలింగ్ ద్వారా నింపడం జరుగుతుందన్నారు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పూణెం ప్రభాకర్

గంగారం: మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంట నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొక్కజొన్న, కూరగాయల పంటలు, మామిడి తోటలు పెద్ద ఎత్తున వర్షాలతో దెబ్బతిన్నాయని, వారికి ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం అందించాలని కోరారు. వర్షాకాలంలో సీజన్‌లో రైతాగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కురుసం రంగయ్య, ఉపాధ్యక్షులుగా జజ్జర వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా రామరావు, కోశాధికారిగా వెంకటయ్య, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వర్‌రావు, సమ్మయ్య, వెంకన్న, సమ్మయ్య ఎన్నికయ్యారు.

ధాన్యం రైతుల గోస

- పది రోజులకుపైగా కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు



అన్నారం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించిన రైతులకు తీరా పండించిన ధాన్యాన్ని అమ్ముకుందామన్నా కష్టం తప్పడంలేదు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు రాకపోవడంతో పదిరోజులకు పైగా ఎండకు, మరోవైపు అకాలవర్షాలకు తట్టుకోలేక రైతులు గోస పడుతున్నారు. ఈ సంఘటన మండలంలోని అన్నారం, కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు అన్నారం, కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, పదిరోజుల క్రితం చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు వచ్చారు. అన్నారం కేంద్రానికి సుమారు 2వేలకు పైగా ధాన్యం బస్తాలు అమ్మకానికి రాగా, కనీసం తేమశాతం చూసేందుకు కొనుగోలు కేంద్రానికి ఎవరూ రాలేదంటూ అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క తేమ శాతం తగ్గడం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకుంటుండగా, మరోపక్క అకాలవర్షం కారణంగా ధాన్యం తడుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై సీఈఓ వెంకటాచలంను వివరణ కోరగా అన్నారం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులు టోకెన్‌లు తెచ్చుకోలేదు, టోకెన్‌లు తెచ్చుకున్న ముగ్గురు రైతులకు సంబంధించిన ధాన్యానికి గురువారం కాంటా పెట్టినం. కోరుకొండపల్లిలో కూడా కొనుగోళ్లు చేస్తున్నాం. రెండు కేంద్రాల్లో కలిపి త్వరలోనే ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి ఎగుమతి చేయిస్తాం.

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పరామర్శించాడు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సలుగు పూర్ణచందర్ గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని సీతారాంపురంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేల్పుల మల్లయ్య సతీమణి వీరసోమమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృత దేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, హెచ్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మండలంలోని కంబాలపల్లి గ్రామంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే బాబన్న, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ హలావత్ లింగన్న మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి వెంటనే కాంటాలు పెట్టాలన్నారు. టోకెన్ పద్ధతి పేరుతో కాంటాలను ఆపడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు లింగంపల్లి లింగన్న, జంగిలి సోమనరసన్న, లెంకల ఎల్లయ్య, కాత్రాల వీరన్న, శిరంశెట్టి సత్యం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యంను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని గాంధీపురం, అనంతరాం గ్రామ రైతులు ఇల్లెందు రోడ్డుపై శుక్రవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో రైతులు రవి, మంగ్యానాయక్, వీరస్వామి, సాధు, బాలు, రాంబాబు, ఐలయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి



మృతిచెందిన కాడెదు వద్ద రోధిస్తున్న రైతులు



ఆందోళన చేస్తున్న తండావాసులు

- నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అయోధ్య జీపీ పరిధిలోని వెంక్యాతండాకు చెందిన రైతులు బానోత్ బాలాజీ, అజ్మీరా బాలాజీ, బానోత్ సిరి, అజ్మీరా రాములుకు సంబంధించిన కాడెద్దులు మేత కోసం తండ శివారులోకి వెళ్లాయి. గురువారం రాత్రి ఈదురుగాలులకు తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు కాడెద్దులు షాక్‌తో మృతిచెందాయి. మిగతా ఎద్దులు స్వల్ప గాయాలతో బయటపడ్డాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఎద్దులు మృతి చెందాయని, రూ.1.20లక్షల నష్టం వాటిల్లిందని, పరిహారం అందించాలంటూ రహదారిపై తండావాసులు ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామానికి చెందిన ఎడబోయిన నారాయణకు చెందిన పాడిగేదె విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృతిచెందింది. రూ.70వేల విలువ చేసే పాడిగేదె మృతి చెందడంతో రైతు కన్నీటి పర్యంతమయ్యారు.

ఎద్దు మృతి..

గూడూరు: మండలంలోని మధనాపురం గ్రామంలో రైతు లింగాల సుధీర్‌రెడ్డికి చెందిన రెండు గేదెలు మేత కోసం వెళ్లగా విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు విలపించాడు.

బీఆర్ఎస్ హయాంలోనే సమస్యలు



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కేసముద్రం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని అమీనాపురం గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందంటూ కేసముద్రం మార్కెట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.లక్ష రుణమాఫీ చేయలేదని, రైతులకు పంటనష్ట పరిహారం అందించలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస గ్రామ అధ్యక్షుడు సామ సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు క్లోం శ్రీనివాస్‌రెడ్డి, పోతుల రవి, లింగాల నేతాజీ, మందుల కృష్ణమూర్తి, ఏలియా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

గార్ల: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. గార్ల మండలం మర్రిగూడెం పంచాయతీ డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన వివాహిత ఇస్లావత్ అక్షయ గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. భర్త ఇస్లావత్ రామ్‌కుమార్ బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

కొత్తగూడ: రైతులు పండించే అన్నిరకాల వరిధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామంటు మాట మార్చడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన రైతులు పండించే దొడ్డు, సన్న రకం ధాన్యానికి బోనస్ ప్రకటించాలని కోరారు. లేదంటే రైతులతో కలసి ఉద్యమిస్తామన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



తొర్రూరు: రానున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ భూసాని రాము, నాయకులు జాటోతు రవినాయక్, కందాడి అచ్చిరెడ్డి, ధరావత్ సోమన్న, నల్లపు రాజు, మధు పాల్గొన్నారు.

అన్నకు తలకొరివి పెట్టిన చెల్లె

నెల్లికుదురు: మండల కేంద్రానికి చెందిన దూపటి సమ్మయ్య (47) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి పిల్లలు లేకపోవడంతో చెల్లె మడత శ్రీలత అన్నకు శుక్రవారం తలకొరివి పెట్టింది.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

డోర్నకల్: డోర్నకల్ ప్రాంత ప్రజలకు సుపరిచితుడు, స్థానిక రైల్వే హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన వల్లభనేని విజయసేన్(83) గురువారం రాత్రి హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పండల సుబ్బారావు, రాజేశ్వరి, నారాయణమూర్తి, తత్రి నరేష్, కందుల మధుసూదన్, విత్తనాల సుధాకర్ సంతాపం తెలిపారు.

ఇసుక డంపు సీజ్

మరిపెడ రూరల్: మండలంలోని తండధర్మారం శివారు ఆకేరు వాగు నుంచి కొందరు వ్యక్తులు ఇసుకను తరలించి డంపు చేశారు. శుక్రవారం విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేశారు. సీజ్ చేసున ఇసుక డంపు సుమారు 150 ట్రిప్పులు ఉంటుందని తెలిపారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు తాళ్లపల్లి నవీన్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా కుటుంబ దీనస్థితికి చలించిన సహచర పాత్రికేయులు శుక్రవారం ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రంగు లక్ష్మణ్, సుంకరి ఓంకార్, జాటోతు దామోదర్, బారి విక్రం, జాటోతు సుధాకర్, రాజేందర్, మల్లేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన గిరిజనం



డోర్నకల్: డోర్నకల్ మండలం లింబ్యాతండా శివారు లచ్చాతండాలో శుక్రవారం జరిగిన వేంకటేశ్వరస్వామి(రాంసింగ్ బాబా) బ్రహ్మోత్సవ జాతరకు గిరిజన భక్తులు పోటెత్తారు. లచ్చాతండాలో మూడురోజులపాటు జరిగే జాతరలో రెండోరోజు మలస్సూర్‌బాబా కందూరు వేడుకలకు వివిధ జిల్లా నుంచి గిరిజన భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

మూగజీవాలను కాపాడాలి

గార్ల: భూమికి తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడే విద్యుత్ తీగలతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతానికి పశువులు, గేదెలు మృతిచెందిన రైతులకు విద్యుత్‌శాఖ నష్టపరిహారం చెల్లించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

విద్యుత్ స్తంభం నుంచిపడి గాయాలు

గూడూరు: విద్యుత్ స్తంభం నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని మట్టెవాడలో శుక్రవారం జరిగింది. మట్టెవాడకు చెందిన గుండెబోయిన హరీశ్ అనే వ్యక్తి గ్రామ విద్యుత్ హెల్పర్, లైన్‌మెన్ చెప్పిన విద్యుత్ మరమ్మతుల పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో స్తంభం ఎక్కిన హరీశ్ ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన విద్యుత్ సిబ్బంది వెంటనే మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడ నుంచి గార్డియన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ ప్రణీత్ తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం





మహబూబాబాద్ రూరల్/కేసముద్రం: జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ పమ్మి సనాతనచారి అనురాధ దంపతులు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తాడూరు మాధవాచారి గీతాదేవి, ఉపాధ్యక్షులు లక్ష్మణాచారి రమాదేవి, సహాయ కార్యదర్శి మణి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.